సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ၊ 2 ၊ అక్టోబర్ ၊ 2023



మా గోడు పట్టించుకోండి

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. రోజుకో రూపంలో నిరసన తెలుపుతున్నారు. 8లో



...ఇల్లెందు అగ్రగామి

బొగ్గు ఉత్పత్తిలో సెప్టెంబర్ నెలలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో నిలిచిందని సింగరేణి అధికారులు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. పలు చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఏటీ డేవిడ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గాంధీ జయంతి ప్రభుత్వ సెలవు కావడంతో అధికారులు అందుబాటులో ఉండరని, దీంతో రద్దు చేశామని, ఆదివాసీ గిరిజనులు ఈ విషయాన్ని గమనించి కార్యాలయానికి రావద్దని పేర్కొన్నారు.

ముగిసిన గణపతి నిమజ్జనాలు



నిమజ్జనం చేస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద పవిత్ర గోదావరిలో గణనాథుల నిమజ్జన కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. నవరాత్రుల అనంతరం అనివార్య కారణాలతో 11 రోజుల పాటు గణనాథులకు పూజలు చేసిన భక్తులు నిమజ్జనానికి విగ్రహాలను తీసుకొచ్చారు. దీంతో అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనం పూర్తైంది.

ఇల్లెందు ఎమ్మెల్యే బుజ్జగింపులు!



మున్సిపల్ చైర్మన్‌తో చర్చలు జరుపుతున్న ఎమ్మెల్యే హరిప్రియ, ఇతర నాయకులు

ఇల్లెందు: రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు ఇల్లెందు అసమ్మతి నేతలు తమ గోడు వెల్లబోసుకున్న 24 గంటల్లో అదే అసమ్మతి నేతల వద్దకు ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ వెళ్లారు. ఆదివారం ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఇంటికి ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, కోనేరు చిన్నితోపాటు మరో ఇద్దరు ఖమ్మానికి చెందిన నేతలు హాజరై బుజ్జగింపులు చేశారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో అసమ్మతి నేతలు సుమారు 120 మంది మంత్రి హరీష్‌రావుకు సమస్యలు విన్నవించడంతో.. అసమ్మతి నేతలు మరోసారి తన వద్దకు రాకుండా వారితో చర్చించుకోవాలని మంత్రి ఎమ్మెల్యేకు సూచించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అసంతృప్తి నేతలతో మాట్లాడుతున్నట్లు సమాచారం. సమన్వయంతో అంతా కలిసికట్టుగా పనిచేద్దామని, అందరిని కలుపుకుని పోతామని, అభయం ఇస్తున్నట్లు తెలిసింది.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం



మహిళా పోలీస్ డ్రెయినేజీలో పడి మృతి చెందిన, తరచూ వర్షపునీరు చుట్టుముట్టే అన్నదాన సత్ర ప్రాంతం

ముందస్తుగా హెచ్చరించిన సాక్షి..



గోదావరి వరదతోపాటు భద్రాచలంలో పడిన వర్షపు నీటితో కూడా పెను ముప్పు ఉందని, ఇందుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఇటీవల కాలంలో సాక్షి పలు కథనాలను ప్రచురించింది. కేటీఆర్ పర్యటనను పురస్కరించుకుని శనివారం కూడా 'రూపు మారని భద్రగిరి' శీర్షికన ఇదే విషయమై ప్రత్యేక కథనాన్ని వెలువరించింది. వర్షపు నీటిని గోదావరిలో కలిపేందుకు శాశ్వత ప్రాతిపదికన గోదావరికి దిగువ భాగాన 'మురుగు నీరు స్లూయిజ్ పాయింట్', సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మించాలని సూచించింది. గతంలో 'వరద కాదు బురద', 'మాస్టర్ ప్లాన్‌పై ముందడుగేది..' వంటి కథనాలతో సమస్యను ఎత్తి చూపినా అధికారులు స్పందించలేదు. చివరకు ఓ నిండు ప్రాణం పోవడానికి కారకులయ్యారు.

అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థతో మహిళా హెడ్ కానిస్టేబుల్ మృత్యువాత

- జనాభా పెరుగుతున్నా మెరుగుపర్చని మురుగు కాల్వలు
- ప్రత్యేక కథనాలతో సమస్యను ఎత్తి చూపిన 'సాక్షి'
- స్పందించని స్థానిక, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు



భద్రాచలంలోని మెడికల్ కాలనీలో రోడ్డు మధ్యలో తెరిచి ఉంచిన మ్యాన్ హోల్

భద్రాచలం: విధి నిర్వహణకు వచ్చిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి భద్రాచలంలో డ్రెయినేజీలో పడి ప్రాణాలు విడిచిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలిచివేసింది. వర్షపునీరు రోడ్డును ముంచివేసిన సమయంలో పరిస్థితిని అంచనా వేయలేక ప్రమాదానికి గురైంది. ఎప్పుడు వర్షం పడినా భద్రాచలం ఇలాగే సంద్రంగా మారుతోంది. అయితే ఇలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడింది.? తప్పిదం ఎవరిది? స్పందించని ప్రభుత్వానిదా? పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లని అధికార యంత్రాంగానిదా? ప్రజా సమస్యలను గాలికొదిలేసినా ప్రజాప్రతినిధులదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సోషల్ మీడియాలోనూ ఇదే చర్చ నడుస్తోంది.

ఎక్కడ ఏ మ్యాన్‌హోల్, డ్రెయినేజీ ఉందో..?

భద్రాచలం పట్టణం 20 వార్డులు, సుమారు లక్ష మంది జనాభా కలిగి ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భారీ వాణిజ్య భవనాలు, నివాస సముదాయాలు వెలుస్తున్నాయి. ఈ క్రమంలోనే కొందరు రోడ్లు, డ్రెయినేజీలను ఆక్రమించుకొని ఇళ్లు, దుకాణాలు నిర్మించారు. దీంతో కొద్దిపాటి వర్షానికే వరద నీరు రోడ్లు, కాలనీలను ముంచెత్తుతోంది. చర్ల, కూనవరం రోడ్డు, గ్రామ పంచాయతీ, మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో మోకాళ్ల లోతులో నీళ్లు నిలుస్తున్నాయి. శివారు జగదీష్ కాలనీ, ఏఎంసీ కాలనీలను వరద చుట్టుముడుతుండగా, రవాణా వ్యవస్థ స్తంభించిపోతోంది. ఎక్కడ ఏ మ్యాన్‌హోల్, డ్రెయినేజీ ఉందో తెలియని పరిస్థితి నెలకొంటోంది. గత శనివారం ఇదే పరిస్థితి ఏర్పడి అన్నదాన సత్రం వద్ద వర్షపు నీటిలో మునిగిపోయిన డ్రెయినేజీలో పడి హెడ్ కానిస్టేబల్ మృతి చెందింది.

మెగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తేనే..

ఏజెన్సీ చట్టాల వలన, కోర్టులో కేసులు నడుస్తుండటం, పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లు గవర్నర్ వద్ద ఉండిపోవడంతో భద్రాచలం ఇటు మున్సిపాలిటీకి, అటు గ్రామపంచాయతీకి నోచుకోలేదు. పాలకవర్గం లేకపోవడంతో పట్టణ సమస్యలపై ప్రశ్నించేవారు లేకుండాపోయారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చలేదు. ఎమ్మెల్యే, ఎంపీ, ప్రత్యేక నిధులతో మురుగు కాల్వలు నిర్మించాల్సి ఉన్నా ఇటీవల కాలంలో కమీషన్ల కక్కుర్తితో కేవలం సీసీ రోడ్లకే పరిమితమయ్యారు. డ్రెయినేజీల నిర్మాణాన్ని గాలికొదిలేశారు. వర్షం పడితే పట్టణంలోని నీరంతా రామాలయం వద్దకు చేరుకోవటం, స్లూయిజ్‌లను మూసివేయటంతో విస్టా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రాలను చుట్టుముట్టడం రివాజుగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థ, గోదావరికి దిగువ భాగాన స్లూయిజ్ పాయింట్ నిర్మాణం ఉండేలా 'మెగా మాస్టర్ ప్లాన్'ను రూపొందించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

భద్రాచలాన్ని ముంచెత్తుతున్న వర్షపునీటి సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రజల ప్రాణ రక్షణకు పొంచి ఉన్న ముప్పును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జిల్లా అధికారులు విఫలమయ్యారు. శ్రీదేవి మృతిలాగే మరో ప్రమాదం జరగకముందే మేల్కోవాలి.

–పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే

నాలుగు రోజుల అధికారి!

- వారానికి నాలుగైదు రోజులే విధుల్లో..
- కీలక అధికారి పనితీరుపై తీవ్ర విమర్శలు
- కబ్జాదారులకు ఇంటినంబర్ల కేటాయింపులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు, సిబ్బంది
- అస్తవ్యస్తంగా కొత్తగూడెం మున్సిపాలిటీ



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడెంలో కీలక అధికారి తీరు విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు, కౌన్సిల్ సభ్యులకు, సిబ్బందికి పెద్ద దిక్కుగా కుండా పాలనను చక్కబెట్టాల్సిన సదరు అధికారి అందుబాటులో ఉండటం లేదని, వారంలో నాలుగు రోజులే విధుల్లో ఉంటున్నారనే పేరుంది. సదరు అధికారి కనీసం ఫోన్‌కు కూడా స్పందించడం లేదని సిబ్బంది, కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టం లేని ఊరుకు అయిష్టంగా వచ్చి ఆ ప్రతాపమంతా ప్రజలపై, సిబ్బందిపై చూపుతున్నారని, కొందరు కాంట్రాక్టర్లు, కౌన్సిల్ సభ్యులతో చేతులు కలిపి మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిందిపోయి బాధ్యతారాహిత్యంగా కబ్జాదారులకు దొడ్డిదారిన ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సదరు అధికారి వచ్చిన కొత్తలోనే ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా రాత్రికి రాత్రే మున్సిపల్ మార్కెట్ సంబంధిత షెడ్లను జేసీబీలతో కూల్చివేయించారు. దీంతో వ్యాపారులు ఆగ్రహం చెంది అఖిలపక్షంతో కలిసి మున్సిపాలిటీని ముట్టడించారు. ఆ సమయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధి వ్యాపారులకు అండగా నిలిచి మున్సిపాలిటీ అధికారికి చీవాట్లు పెట్టారు. అయినా ఆయన తీరులో మార్పు రాలేదని పట్టణ ప్రజలు, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో జిల్లాలోని ఇతర మూడు మున్సిపాలిటీలకు ఆదర్శంగా ఉండాల్సిన కొత్తగూడెంలో పాలన అస్తవ్యస్తంగా మారుతోంది.

అధికార పార్టీ కౌన్సిలర్ నిరసన దీక్ష

ఇటీవల 36వ వార్డులో అక్కడి, అధికార పార్టీ కౌన్సిలర్‌కు తెలియకుండా ఆ అధికారే కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో కౌన్సిలర్ అధికారి తీరును నిరసిస్తూ దీక్ష చేపట్టారు. సదరు అధికారి క్షమాపణ చెప్పడంతో కౌన్సిలర్ దీక్ష విరమించారు. ఇక మున్సిపాలిటీలో రెవెన్యూ, బర్త్, డెత్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ ఇలాంటి విభాగాల వారికి నెలవారీగా కమీషన్ టార్గెట్ ఇచ్చారనే ప్రచారం కూడా సాగుతోంది.

శుక్రవారం సాయంత్రమే సొంతూరుకు..

సదరు అధికారి వారంలో మూడు, నాలుగు రోజుల కంటే ఎక్కువ అందుబాటులో ఉండటం లేదని కౌన్సిలర్లు, సిబ్బంది పేర్కొంటున్నారు. శుక్రవారం వస్తే సాయంత్రమే కొత్తగూడెం నుంచి సొంతూరికి వెళ్తారని, శనివారం, ఆదివారం ఎవరికీ అందుబాటులో ఉండరని, అధికారిక నంబర్‌ను కూడా కాల్ డైవర్ట్‌లో పెడతారని ఆరోపిస్తున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఎవరినీ సంప్రదించాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. విధుల్లో ఉన్న రోజుల్లో కూడా హడావిడిగా ఉంటారని, పాలనాపరమైన పనులు సకాలంలో జరగడం లేదని చెబుతున్నారు.

పట్టని మున్సిపల్ సమస్యలు

- కొత్తగూడెంలోని వార్డుల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. కౌన్సిలర్లు భూ కబ్జాలు, గృహలక్ష్మి ఎంపికలు, దళితబంధు కమీషన్ల కోసం పాకులాడుతూ కాలం గడుపుతున్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. కనీసం అధికారులైనా పట్టించుకుంటారనుకుంటే అదీ లేదు.
- ఇటీవల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద యాష్ ట్యాంకర్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందారు. ఆ తర్వాత ట్యాంకర్‌ను అక్కడి నుంచి తీసివేశారు. ప్రమాదం జరిగి పక్షం రోజులు గడిచినా అక్కడ పడ్డ యాష్ తొలగించలేదు. దీంతో గాలిదుమారానికి బూడిద లేచి వాహనదారులపై పడి ఇబ్బంది పడుతున్నారు.
- కొత్తగూడెం పట్టణవాసులకు సరఫరా చేస్తున్న కిన్నెరసాని తాగునీరు బురదమయంగా సరఫరా అవుతోంది. నీటిలో ఆలం, ఇసుక వేసి శుభ్రం చేయకుండా సరఫరా చేస్తున్నా ముడుపులు తీసుకుని బిల్లులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.
- మున్సిపల్ సిబ్బంది ఇటీవల ఇళ్ల స్థలాలు, గృహలక్ష్మి సర్వే నిర్వహించారు. డబ్బులు తీసుకుని అనర్హులకు పథకాలను వర్తింపజేశారంటూ వార్డుల్లో ఇప్పటికీ గొడవలు జరుగుతున్నాయి.

కేటీపీఎస్ భద్రత కుదింపు

- పాత ప్లాంట్ పర్యవేక్షణ హోంగార్డులకు అప్పగింత!
- రక్షణ బాధ్యతల నుంచి ఎస్‌పీఎఫ్‌ను తప్పించే యోచన
- రూ.కోట్ల విలువైన ఆస్తుల భద్రతపై సందేహాలు



కేటీపీఎస్ ప్రహరీకి వేసిన కన్నం

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని పాత ప్లాంట్ (ఒఅండ్‌ఎం)లో ఎస్‌పీఎఫ్ భద్రతను తగ్గించేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. కాంప్లెక్స్ పరిధిలోని ఒఅండ్‌ఎం, 5,6,7 దశల కర్మాగారాల రక్షణ బాధ్యతలను ఎస్‌పీఎఫ్ చూస్తోంది. కాలం చెల్లిన పాతప్లాంట్ (720 మెగావాట్లు)ను గత 2018 సంవత్సరంలో మూసివేశారు. ఆ కర్మాగారం స్థానంలో 7వ దశ(800 మెగావాట్లు) నిర్మించారు. మూసివేతతో పాత ప్లాంట్ నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. అందులోని సామగ్రి స్క్రాప్ టెండర్లు దక్కించుకున్న ముంబైకి చెందిన హెచ్ కమర్షియల్ సంస్థ, గత జనవరి నుంచి సామగ్రిని తుక్కుగా చేసి తరలిస్తోంది. ఇక కర్మాగారంలో మిగిలిన అడ్మిన్ బ్లాక్‌లు, స్పేర్ పార్ట్స్ మెటీరియల్ స్టోర్స్ విభాగాలకు ఎస్‌పీఎఫ్ భద్రతను తొలగించి హోంగార్డులను నియమించేలా యాజమాన్యం చర్యలు చేపడుతోంది. గతంలో సెక్యూరిటీ నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటం వల్లే ఎస్‌పీఎఫ్‌కు అప్పగించారు. ఇప్పుడు మళ్లీ ఎస్‌పీఎఫ్ భద్రతను కుదించడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

హోంగార్డులతో రక్షణ సాధ్యమేనా?

కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలోని ఒఅండ్‌ఎం కర్మాగారంలో 107 మంది, 5,6 దశల్లో 123మంది, 7వ దశలో 52 ఎస్‌పీఎఫ్ సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో అడిషనల్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు. పాత ప్లాంట్‌లో సామగ్రి తరలింపు ప్రక్రియ పూర్తికాగానే ఎస్‌పీఎఫ్ సిబ్బందిని మణుగూరు బీటీపీఎస్‌కు, నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మాణంలో ఉన్న వైటీపీఎస్ (యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్)కు బదిలీ చేయాలని చూస్తున్నారు. స్పేర్ పార్ట్స్ ఉన్న స్టోర్స్, అడ్మిన్ బ్లాక్‌లు కలిపి భద్రతను జెన్‌కో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న 16మందితో పాటు, బీటీపీఎస్ భూ నిర్వాసితుల పేరుతో ఉద్యోగాలు పొందిన 25 మందిని హోంగార్డులుగా తీసుకుని అప్పగించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో స్టోర్స్‌లో పనిచేసే ఇంజనీర్లు రూ.లక్షల విలువైన సామగ్రిని అక్రమంగా బయటికి తరలించి సస్పెన్షన్‌కు గురైన సంఘటనలు ఉన్నాయి. కొందరు స్టోర్స్‌పై భాగంలో ఉండే రేకులు తొలగించి చోరీలకు పాల్పడ్డారు. దీనికితోడు కేటీపీఎస్ ఒఅండ్‌ఎం కర్మాగారం సుమారు 400 ఎకరాలకు పైగా ఉంటుంది. చుట్టూ ప్రహరీ ఉన్నా దొంగలు ఇప్పటికే గోడ దూకి సామగ్రి చోరీ చేస్తున్నారు. ఇటీవల యాష్ పాండ్‌లో కూడా పైపుల చోరీల పరంపర కొనసాగుతోంది. ఎస్‌పీఎఫ్ బలగాలు ఉన్నా కూడా చోరీలు జరుగుతుంటే, ఇక భద్రత విధుల నుంచి వారిని తొలగిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. హోంగార్డుల స్థానంలో 41 మంది ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్లనే ఉంచి, మిగిలినవారిని బదిలీ చేస్తే మేలని పలువురు పేర్కొంటున్నారు. కాగా హోంగార్డులు సక్రమంగా విధులకు హాజరు కాకపోయినా వేతనంలో కోత తప్ప వారిపై ఇతర క్రమశిక్షణ చర్యలు ఉండవు. వారికి ఆయుధాలు కూడా ఉండవు. ఇప్పటికే అక్కడ సీసీ కెమెరాలు కూడా లేవు. దీంతో కర్మాగారం భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై విజిలెన్స్ ఎస్పీ ముత్యం రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులో లేరు.

వయోవృద్ధులను సంరక్షించుకోవాలి

అదనపు కలెక్టర్ రాంబాబు



వయోవృద్ధులను సన్మానిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం మహిళా, శిశు సంక్షేమ, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. వయోవృద్ధులకు కుటుంబపరంగా, సామాజిక పరంగా అండగా ఉండాలని చెప్పారు. చాలామంది వృద్ధులు తమ పిల్లల నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో, ఒంటరితనంతో ఎన్నో అవమానాలను భరిస్తూ కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారికి వయోవృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం అండగా ఉంటామని చెప్పారు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలదేనని స్పష్టం చేశారు. పెద్దవారికి సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం వయోవృద్ధులను సన్మానించారు.

పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు

పోలింగ్ కేంద్రాల్లో వయో వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్లు రాంబాబు, స్వీప్ నోడల్ అధికారి మధుసూదన్‌రాజు పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగంపై కలెక్టరేట్‌లో ఆదివారం వయోవృద్ధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రూపొందించిన ఓటరు చైతన్య గీతాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మహిళా, శిశు, వయోవృద్ధుల, వికలాంగుల సంక్షేమ అధికారి విజేత, డీపీఆర్ఓ శీలం శ్రీనివాస్, త్రినాథ్‌బాబు, స్వర్ణలత లెనినా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, కృష్ణయ్య, ఈఎస్ఎన్ రెడ్డి, జి.భూషణ్, వెంకటేశ్వరరావు, సందీప్, యూసుఫ్, శేషు, రిటైర్డ్ గెజిటెడ్ సంఘం అధ్యక్షుడు పాపయ్య, ఒడ్డు గూడెం సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అభయహస్తం' వచ్చేనా?

- నిధుల కోసం మహిళల ఎదురుచూపులు
- నగదు తిరిగిస్తామని చెప్పి ఏడాదిన్నర..
- ప్రభుత్వం విడుదల చేస్తే ఉమ్మడి జిల్లాలో 2.14 లక్షల మంది సభ్యులకు లబ్ధి



ఖమ్మంమయూరిసెంటర్ : స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉంటూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం మహిళలు అభయహస్తం పథకానికి డబ్బులు చెల్లించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసి మహిళా సభ్యుల పిల్లల చదువులకు ఉపకార వేతనాలు, వృద్ధాప్యంలో పింఛన్‌తో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. తక్షణ సాయంగా అంత్యక్రియలకు రూ.5 వేలు ఇచ్చేవారు. అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం, తెలంగాణలో కొత్త ప్రభుత్వ పాలన ప్రారంభమైన తర్వాత ఈ పథకాన్ని నిలిపివేసింది. అయితే అప్పటివరకు అభయహస్తం కింద నగదు చెల్లించిన మహిళలు తాము చెల్లించిన నగదును తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. దీంతో గతేడాది మార్చిలో అభయహస్తం కింద నగదు చెల్లించిన మహిళలను గుర్తించి, వారికి నగదు తిరిగి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2,14,987 మంది ఈ పథకానికి నగదు చెల్లించారు.

పథకం ప్రారంభం ఇలా..

అభయహస్తం పథకాన్ని 2009లో ప్రారంభించగా.. స్వశక్తి సంఘాల్లో సభ్యులుగా ఉండి 18 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలను అర్హులుగా గుర్తించారు. పొదుపు సంఘాల్లోని సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. మహిళా సభ్యులు ఏటా రూ.365 చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం రూ.360 జమ చేస్తుండేది. జమ చేసిన డబ్బుతో 60 ఏళ్లు నిండిన తర్వాత అభయహస్తం పథకం పింఛన్‌గా ప్రతినెలా రూ.500 చొప్పున ఐదేళ్ల పాటు చెల్లించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం, ప్రభుత్వం మారడం, రాష్ట్రంలో వృద్ధాప్య పెన్షన్‌ను రూ.2,016కు పెంచడంతో ఈ పథకం మూలన పడింది.

2,14,987 మంది సభ్యులకు..

అభయహస్తం కింద తాము చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని చాలాకాలం నుంచి మహిళలు కోరుతున్నారు. మంత్రి మండలి ఉప సంఘం ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులకు వడ్డీతో కలిపి ఇవ్వాలని గతేడాది మార్చిలో నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో 1,36,656 మంది, భద్రాద్రి జిల్లాలో 78,331 మంది లబ్ధిదారులు ఉన్నారు. మొత్తంగా ఈ రెండు జిల్లాల వ్యాప్తంగా 2,14,987 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సభ్యులు, వారి బ్యాంక్ ఖాతా వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ఏడాదిన్నర అయినా..

అభయహస్తం పథకానికి నగదు చెల్లించిన మహిళలకు తిరిగి నిధులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఏడాదిన్నర దాటినా నేటికీ తిరిగి చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తాము చెల్లించిన అభయహస్తం నిధులను తిరిగి వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం

అభయహస్తం పథకానికి మహిళా సభ్యులు చెల్లించిన నగదు, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళల బ్యాంక్ ఖాతాల వివరాలను కూడా గతేడాది నమోదు చేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే మహిళల ఖాతాల్లో నేరుగా ఆ నగదు జమవుతుంది.

– ఎం.విద్యాచందన, ఖమ్మం డీఆర్‌డీఓ

భద్రగిరిలో భక్తుల సందడి

వైభవంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన





వేడుకల్లో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) స్వామివారు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారు కొలువైన భద్రగిరి ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వరుస సెలవు రోజులు కావడంతో రామాలయానికి భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనానికి బారులుదీరారు. అర్చకులు దేవస్థానంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకి సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారికి జరిగిన నిత్యకల్యాణంలో పెద్ద ఎత్తున 144 జంటలు పాల్గొన్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

జడ్జికి బస్తీవాసుల సత్కారం



హారికను సత్కరిస్తున్న బస్తీవాసులు

ఇల్లెందు: ఒకే బస్తీలో పుట్టి, పెరిగి ఓ న్యాయమూర్తిగా ఎన్నికైన ఇల్లుటూరి హారికను బస్తీ వాసులు ఘనంగా సత్కరించారు. ఆదివారం పట్టణంలోని వినోభానగర్ కాలనీకి చెందిన ప్రజలు ఆమెను సత్కరించి అభినందించారు. తమ బస్తీ నుంచి జడ్జిగా ఎంపికై వరంగల్‌లో బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని బస్తీ వాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నెమలి ధనమ్మ, కొర్లపాటి కిరణ్, సర్వయ్య, రాజేశ్, వెంకటస్వామి, వెంకటి, ఎల్లయ్య, భారతమ్మ, శ్రీను, భరత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రకళకు నాలుగు బంగారు పతకాలు



పతకం అందుకుంటున్న చంద్రకళ

అశ్వాపురం: అశ్వాపురానికి చెందిన మోర్తినేని చంద్రకళ నాలుగు విభాగాల్లో తన సత్తా చాటి బంగారు పతకాలు సాధించింది. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన 6వ మాస్టర్ గేమ్స్ తెలంగాణ స్టేట్ మీట్ – 2023 అథ్లెటిక్ క్రీడల్లో భాగంగా షాట్‌పుట్, హ్యామర్ త్రో, జావెలిన్‌త్రో, డిస్కస్ త్రో పోటీల్లో ప్రథమ స్థానం సాధించి నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా చంద్రకళను డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్ బానోత్ శారద, భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాల్వంచరూరల్: వినాయకుడి మండపం వద్ద డీజే సౌండ్ అతిగా పెట్టడంతో.. తగ్గించండి అన్నందుకు ఓ వ్యక్తిపై దాడి చేయగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపురం గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయం వద్ద వినాయకుడి మండపం ఏర్పాటు చేశారు. కాగా ఆదివారం మండపం వద్ద డీజే సౌండ్ ఎక్కువపెట్టడంతో స్థానికుడైన బానోత్ సుమన్ సౌండ్ తగ్గించండి చెప్పగా.. అతడిపై బోడ పవన్, బాలు, విజయ్‌లు మూకుమ్మడిగా దాడిచేసి చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనపై..

భద్రాచలం అర్బన్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. ఎటపాక మండలం రాయినిపేట గ్రామానికి చెందిన చంటిబాబు గత నెల 23వ తేదీన విధులకు వెళ్తుండగా.. సారపాక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న రాము ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో చంటిబాబుకు గాయాలు కాగ భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, ఆతర్వాత హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై బాధితుడు చంటిబాబు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సుజాతనగర్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని సీతంపేట బంజర గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురి పేకాటరాయుళ్లను పట్టుకుని వారి వద్ద నుంచి సుమారు రూ.6 వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు లారీలు ఢీ..



డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

పెనుబల్లి: మండలంలోని మండాలపాడు గ్రామశివారులో జాతీయ రహదారి బ్రిడ్జిపై ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు లారీల కేబిన్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఒక లారీ కేబిన్లో డ్రైవర్ రాజేంద్ర ఇరుక్కుపోగా 108 సిబ్బంది, పోలీసులు, స్థానికులు రెండు గంటల పాటు శ్రమించి బయటకు తీసి, పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీలు రెండు రహదారికి అడ్డంగా ఉండటంతో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మా గోడు పట్టించుకోండి..

- 21వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె
- అధికారులకు సవాల్‌గా మారిన పౌష్టికాహారం పంపిణీ



కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

కొత్తగూడెంటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెకు దిగిన విషయం విదితమే. కాగా, ఆదివారానికి వారి సమ్మె 21వ రోజుకు చేరింది. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం అధికారులకు సవాల్‌గా మారింది. అయితే, సోమవారం నాటికల్లా విధుల్లో చేరకపోతే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని యూనియన్ నాయకులు తెలుపుతున్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెలోనే ఉంటామని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, టీచర్లకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రోజుకో రకంగా.. వినూత్న రీతిలో వారు ఆందోళన చేస్తున్నారు.

వారానికి సరిపడా..

మున్సిపాలిటీల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో బిల్ కలెక్టర్‌లు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, మున్సిపల్ బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు ఆయా సెంటర్లకు వెళ్లి వారానికి సరిపడా సరుకులను ఒకేసారి అందిస్తున్నామని చెబుతున్నారు. కానీ, కొన్నిచోట్ల అధికారులను సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు సరుకులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. కొన్నిచోట్ల అధికారులు తాళాలను పగులగొట్టి సరుకులు అందజేస్తున్నారు.

సమ్మె విరమించేది లేదు..



సమాన పనికి సమాన వేతనం అందించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. సమస్యలు పరిష్కరించేంత వరకు విరమించేది లేదు. 21రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వానికి, అధికారులకు ఏమాత్రం పట్టింపులేకుండాపోయింది. ఇప్పటికైనా చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలి. ఎంతగా పని చేసినా మాకు గుర్తింపు దక్కడం లేదు. – గోనె మణి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

మాకు న్యాయం చేయాలి..



ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తూ పనిచేస్తున్నప్పటికీ మా సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు అధిక పనిభారం మోపినా చేశాం. సమాన పనికి సమాన వేతనం కావాలని అడగటం అన్యాయమా. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి. లేదంటే అప్పటివరకు సమ్మెలేనే ఉంటాం.

– రూప, అంగన్‌వాడీ టీచర్, కొత్తగూడెం

న్యాయం జరిగే వరకూ పోరాటం



అంగన్‌వాడీలుగా మేము పడుతున్న కష్టానికి తగిన ఫలితం కావాలంటున్నాం. వేతనాలను పెంచాలని, సమస్యలు పరిష్కరించాలంటున్నాం. ప్రభుత్వం చెప్పిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేస్తున్నాం. అలాంటి మాపై ఎందుకు వివక్ష. ప్రభుత్వం, అధికారులు ఇప్పటి వరకూ స్పందించలేదు.

– ప్రమీల, అంగన్‌వాడీ టీచర్, కొత్తగూడెం

కడసారిగా.. కన్నీటి వీడ్కోలు

- హెడ్ కానిస్టేబుల్ భౌతికకాయానికి నివాళులర్పించిన ఎస్పీ, ఎమ్మెల్యే వనమా
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



శ్రీదేవి భౌతికకాయానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ



గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీస్ సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలంలో విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి ప్రాణాలు కోల్పోయిన కొత్తగూడెం వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీదేవి అంత్యక్రియలను ఆదివారం పోలీసులు, తోటి ఉద్యోగులు, బంధువులు కలిసి అధికారిక లాంఛనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్రీదేవి భౌతికకాయానికి జిల్లా ఎస్పీ డా. వినీత్ జి, ఆయన సతీమణి ప్రీతిలతో పాటు ఓఎస్డీ టి.సాయి మనోహర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. కాగా, తక్షణ సాయం కింద ఎస్పీ ఆయన వ్యక్తిగతంగా రూ.లక్ష నగదును వారి కుటుంబసభ్యులకు అందజేశారు. అంతేకాక పోలీసు అధికారుల అసోసియేషన్ తరఫున రూ.20 వేలు దహన సంస్కారాల నిమిత్తం అందించారు. 1995 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ శ్రీదేవి ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్, భద్రాచలం టౌన్, కొత్తగూడెం టూ టౌన్, పోలీస్ కంట్రోల్ రూం, కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారని, ఆమె మరణం పోలీసు శాఖకు తీరని లోటని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసు శాఖ వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు..

ఎస్పీ ఆదేశాల మేరకు మేదరబస్తీలోని శ్రీదేవి నివాసం నుంచి మొదలై సూపర్‌బజార్ మీదుగా ఓల్డ్‌డిపో రోడ్డులోని హిందూ శ్మశానవాటిక వరకూ జిల్లా సాయుధ దళ పోలీసులు పరేడ్ నిర్వహించారు. అనంతరం మూడుసార్లు గాల్లోకి కాల్పులు జరిపి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను జరిపించారు.

ఎమ్మెల్యే వనమా నివాళి..

విధి నిర్వహణలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి భౌతికకాయానికి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. శ్రీదేవి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతరులు శ్రీదేవి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బూర్గంపాడు: బూర్గంపాడు కొల్లుచెరువు వద్ద గత ఐదు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలిలా.. మండలంలోని గుండాలపాడుకు చెందిన జోగయ్య(28) గత నెల 27వ తేదీన తన కుమార్తె బిందును తీసుకుని మోటార్ సైకిల్‌పై బూర్గంపాడు సంతకు వస్తున్నాడు. ఈక్రమంలో బూర్గంపాడు కొల్లుచెరువు వద్ద ఎదురుగా వస్తున్న జోగయ్య మోటార్‌సైకిల్‌తో ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో జోగయ్య తీవ్రంగా గాయపడగా.. వరంగల్‌కు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి అడమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఆటో, బైక్ ఢీ..

ఇద్దరికి గాయాలు



ప్రమాద దృశ్యం

పాల్వంచరూరల్: ట్రాలీ ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు గాయపడ్డ సంఘటన మండల పరిధిలోని సారెకల్లు రోడ్డులో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రసాద్ అనే వ్యక్తి ట్రాలీ ఆటో నడుపుకుంటూ పాల్వంచ వైపు వస్తున్నాడు. అదే సమయంలో గోవర్ధన్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఉల్వనూరువైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆటో బోల్తా పడింది. కాగా ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ..

జూలూరుపాడు: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటన మండల కేంద్రమైన జూలూరుపాడులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడులోని రావిచెట్టు బజారు నుంచి బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న మెయిన్ రోడ్‌ను ఓ ద్విచక్రవాహనదారుడు దాటుతుండగా.. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనదారుడికి స్వల్ప గాయాలు కాగా బైక్ నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చంద్రుగొండ మండలవాసి ఉపేందర్ అని స్థానికులు తెలిపారు.

కేజీ మల్లెల సర్పంచ్ మృతి

వేంసూరు: మండలంలోని కేజీ మల్లెల గ్రామ సర్పంచ్ పాత్రు అనంతరామయ్య (76) ఆదివారం మృతి చెందారు. గ్రామ సర్పంచ్‌గా మూడు పర్యాయాలు, సొసైటీ చైర్మన్‌గా పదవులు నిర్వహించారు. 1974 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలిసి పనిచేశారు. కాగా, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యువకుడిపై దాడి

నేలకొండపల్లి: యువకుడిపై దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని బోదులబండ గ్రామంలో శనివారం రాత్రి స్థానిక దేవాలయం వద్ద కోలాటం నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన గుండు మహేశ్ తాను కోరిన పాటకు కోలాటం వేయాలని అడిగాడు. దీంతో గ్రామానికి సంబంధం లేని ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని బాధితుడు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

లారీ ఢీకొని యువకుడు...

సత్తుపల్లిటౌన్: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనటంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సత్తుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. దమ్మపేట మండలం వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన సిద్ధేసి రమేశ్ (35) సత్తుపల్లి బస్టాండ్ ఇన్‌గేట్ వైపు నుంచి అశ్వారావుపేట రోడ్‌వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఖమ్మం వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొంది. తీవ్ర గాయాలైన రమేశ్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సీఐ మోహన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గెట్టు విషయంలో ఒకరిపై...

కారేపల్లి: చేను గెట్టు విషయంలో ఓ వ్యక్తిపై దాడి జరిగిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గేటురేలకాయలపల్లి గ్రామానికి చెందిన బానోత్ రవి, బానోత్ నాగేశ్వరరావు మధ్య కొంతకాలంగా చేను గెట్టు విషయంలో వివాదం నడుస్తోంది. కాగా, రవి గెట్టుపై ఉన్న మిరప మొక్కలను పీకేయడంతో నాగేశ్వరరావు ఆగ్రహంతో తన చేతిలో ఉన్న కర్రతో దాడి చేశాడు. దీంతో రవికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్టరీగా మారిన మహిళ మృతి కేసు

- హత్యా? ప్రమాదమా?
- కేసు నమోదు చేసిన జీఆర్‌పీ పోలీసులు



పార్వతి(ఫైల్)

ఖమ్మంక్రైం: ఖమ్మం నగరంలో శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన మహిళ కేసు మిస్టరీగా మారింది. తొలుత వన్‌టౌన్ నుంచి ఖానాపురం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి చివరికి ఖమ్మం రైల్వే పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వివరాలిలా ఉన్నాయి.. మయూరిసెంటర్‌లోని ఓవర్ బ్రిడ్జి వద్ద కారు ఢీకొని తీవ్ర గాయాలపాలైన నేలకొండపల్లి మండలానికి చెందిన నాయిని పార్వతి (40)ని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా మృతిచెందిందని నగర శివారు అగ్రహారానికి చెందిన నర్రా నాగేశ్వరరావు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారించిన పోలీసులు అతను అబద్ధం చెబుతున్నాడని తిరిగి అడగగా శ్రీరామ్‌హిల్స్ ప్రాంతంలో ప్రమాదం జరిగిందని, తాను తీసుకొచ్చిన ఆస్పత్రి వన్‌టౌన్ పరిధిలో ఉండటంతో ఇక్కడ కేసు పెట్టడానికి వచ్చానని చెప్పాడు. అనంతరం అతడు ఖానాపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈలోపు మృతురాలి భర్త రామారావు, కుటుంబ సభ్యులు చేరుకొని నాగేశ్వరరావు తన భార్యను చంపి ప్రమాదం జరిగిందని చెబుతున్నాడని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని ఆరా తీశారు. పార్వతికి తనకు ముందే పరిచయం ఉందని, ఇద్దరం కలిసి అగ్రహారం సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద రైలు పట్టాలు దాటుతుండగా పార్వతిని రైలు ఢీకొట్టిందని, ఆమెను శ్రీరామ్‌నగర్ గుండా రోడ్డుపైకి తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని నాగేశ్వరరావు చెప్పినట్లు తెలిసింది. భయంతో తాను రోడ్డుప్రమాదం అని చెప్పానని వివరించినట్లు సమాచారం. కాగా, తన భార్యను నాగేశ్వరరావు హత్య చేసి అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నాడని పార్వతి భర్త రామారావు జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా రైలు ఢీకొంటే లోకోపైలట్ వెంటనే సమాచారం అందిస్తాడని, తమకు అలాంటి ఫిర్యాదు అందలేదని, ఘటనా స్థలంలో రైలు పట్టాల వద్ద రక్తపు మరకలు కనిపించాయని, ఒకవేళ ఇదిహత్య కేసు అయితే ఖానాపురం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తామని జీఆర్‌పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపారు. కాగా, తమకు న్యాయం చేయాలంటూ పార్వతి కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఆందోళన నిర్వహించారు.

బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు అగ్రగామి

- సెప్టెంబర్‌లో 146 శాతం బొగ్గు ఉత్పత్తి
- వివరాలు వెల్లడించిన ఏరియా జీఎం జాన్ ఆనంద్



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ వెల్లడించారు. ఆదివారం ఇల్లెందులోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెప్టెంబర్‌లో సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతను ఏరియా వారిగా వివరాలు తెలిపారు. సెప్టెంబర్‌లో నిర్దేశించిన లక్ష్యం 2.12 లక్షల టన్నులు కాగ, 3.10 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసి 146 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఇందులో 1.97 లక్షల టన్నులను బొగ్గు రైలు మార్గం ద్వారా, 0.37 లక్షల టన్నులను రోడ్డు మార్గం ద్వారా, 0.87 లక్షల టన్నులను ఆర్‌సీహెచ్‌పీ ద్వారా బొగ్గు బట్వాడ చేసినట్లు పేర్కొన్నారు. గత నెలలో 52 ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని వెలికి తీయాలని, అందుకు ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. అనంతరం ఏరియాను అగ్రస్థానంలో నిలిపిన ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు, యూనియన్ నాయకులను అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, ఏజీఎం (ఐఈడీ) గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీ.వీ.మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

మెనూ పాటించడం లేదని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

గుండాల: మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని స్థానిక ఎస్సీ వసతిగృహం విద్యార్థులు రోడ్డెక్కారు. ఆదివారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, అన్నం, చారు మాత్రమే పెడుతున్నారని, ఉదయం టిఫిన్ పెట్టడం లేదన్నారు. ఆదివారం వస్తే 20 మంది విద్యార్థులకు కిలో చికెన్ వండి పెడుతున్నారని, గుడ్లు, అరటి పండ్లు ఇవ్వడం లేదని, రెండేళ్లుగా సబ్బులు, ఇతర బిల్లులు వార్డెన్ కాజేస్తున్నాడని ఆరోపించారు. ఈ విద్యా సంవత్సరం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు వార్డెన్ హాస్టల్‌కు రాలేదని తెలిపారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే షాహిద్, పీడీఎస్‌యూ డివిజన్ నాయకుడు నరేందర్ మాట్లాడారు. కాగా, వార్డెన్ నరేశ్‌ను వివరణ కోరగా తాను గుండాల కిరాణా దుకాణంలోనే అన్ని సరుకులు తీసుకుంటున్నానని, మెనూ పాటిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ వర్కర్‌ను హాస్టల్లో ఉండొద్దని చెప్పినందుకే పిల్లలను రెచ్చగొట్టి రోడ్డెక్కిస్తున్నారని చెప్పారు.

క్యాటరింగ్ సరిగా లేదన్నందుకు దాడి..



శుభకార్య నిర్వాహకులపై దాడి చేస్తున్న క్యాటరింగ్ నిర్వాహకులు

పాల్వంచరూరల్: ఓ ఫంక్షన్‌లో క్యాటరింగ్ సప్లయి బాగలేదని వద్దన్నందుకు శుభకార్య నిర్వాహకులపై క్యాటరింగ్ సప్లయి చేసే నిర్వాహకులు విచక్షణారహితంగా కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురికి గాయలు కాగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి పెద్దమ్మగుడి వద్ద ఉన్ను ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న జక్కిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి తన కుమార్తె బాలసార ఫంక్షన్ చేయదలచాడు. ఇందుకు క్యాటరింగ్ కోసం జగన్నాథపురం గ్రామానికి చెందిన గుగులోతు రాకేష్, మహేందర్, చందులాల్, అజయ్, సాయిలు ఒప్పుకున్నారు. ఈక్రమంలో భోజనం సప్లయి చేస్తుండగా.. ఫంక్షన్ నిర్వాహకులు సప్లయి సక్రమంగా చేయడంలేదని, మీరు పనికి వద్దని చెప్పారు. దీంతో వారు బయటకు వెళ్లి గ్రామంలోని మరికొంత మందిని వెంటతీసుకుని వచ్చి ఫంక్షన్ నిర్వాహకులను కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. అంతేకాక ఫంక్షన్ హాల్ కిటికీ అద్దాలు, తలుపులు ధ్వంసం చేశారు. ఈ దాడిలో జక్కిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మంత్రి అప్పలనాయుడు, జాలి సాయిప్రకాశ్‌లకు గాయపడగా.. తీవ్రంగా గాయపడిన అప్పలనాయుడును కొత్తగూడెం ఆస్పత్రికి, మిగిలిన వారిని పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన 10 మంది క్యాటరింగ్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

బార్ షాపులో ఘర్షణ..

ముగ్గురిపై కేసు నమోదు





దాడిలో గాయాలపాలైన ప్రవీణ్‌నాయక్, గౌతమ్

పాల్వంచ: పట్టణంలోని బీసీఎం రోడ్డులో గల ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించేందుకు వెళ్లిన కొందరు యువకులు ఘర్షణ పడగా.. ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి సమయాన నెహ్రూనగర్‌కు చెందిన బాదావత్ ప్రవీణ్‌నాయక్, అతడి స్నేహితులు తెల్లమల్ల ప్రణయ్, సరిమల్ల గౌతమ్, కొమ్మలపాటి నిఖిల్ కలిసి బృందావన్ రెస్టారెంట్‌కు మద్యం సేవించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో పాత లావాదేవీల విషయంలో అక్కడే మద్యం సేవించేందుకు వచ్చిన తుమ్మి ప్రసాద్, ప్రవీణ్ నాయక్‌తో గొడవపడ్డాడు. దీంతో తుమ్మి ప్రసాద్ స్నేహితుడు దేవసాని ప్రసాద్ బీర్ బాటిల్ తీసుకుని ప్రవీణ్ నాయక్ చెంపపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఈనేపథ్యాన అడ్డుకున్న గౌతమ్‌ను చిప్పా భార్గవ్ బీరు బాటిల్‌తో ఎడమ చెవిపై కొట్టగా తీవ్రగాయం కావడంతో వారి మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరుకుంది. అనంతరం గాయపడిన బాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాక ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తుమ్మి ప్రసాద్, దేవసాని ప్రసాద్, భార్గవ్‌లపై ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం ఉదయం రాజ్‌భవన్ ప్రాంగణంలో శ్రమదానం చేశారు. రాజ్‌భవన్‌లోని పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి స్పందనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు శిల్పకళా వేదికగా 'మంథన్-2023'

సాక్షి, హైదరాబాద్: ప్రతీ ఏడాది అక్టోబర్ 2న నగరం వేదికగా నిర్వహించే 'మంథన్-2023' కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. మంథన్ సంవాద్ ఆధ్వర్యంలోని ఈ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలోని శిల్పకళా వేదికగా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ ఏడాది చర్చా కార్యక్రమాల్లో ఒడిశా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎస్.మురళీధర్, న్యూఢిల్లీ పాలసీ రీసెర్చ్ సెంటర్ ప్రెసిడెంట్ యామిని అయ్యర్ తదితరులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐటీ హబ్‌గా విశాఖ

- వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం
- ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనే 50,000 ఉద్యోగాలు వైజాగ్‌లో..
- రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు
- ఏటా 3.5 లక్షల మంది తాజా గ్రాడ్యుయేట్స్ వస్తుండటమే రాష్ట్ర బలం
- పల్సస్ గ్రూపు అధ్యయన నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: రానున్న కాలంలో విశాఖ నగరం ఐటీ ఉద్యోగాలకు కేంద్రంగా మారనుంది. ఈ రంగంలో కొత్తగా కెరీర్ ప్రారంభించే వారికి అది అవకాశాల గని కానుంది. ముఖ్యంగా ఐటీ, ఐటీ ఆధారిత రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి. వచ్చే ఐదేళ్ల కాలంలో ఐటీ రంగంలో ఒక్క విశాఖపట్నంలోనే ఐదులక్షలకు పైగా ఉపాధి అవకాశాలు వస్తాయని పల్సస్ గ్రూపు తన అధ్యయన నివేదికలో వెల్లడించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశాఖపట్టణాన్ని పరిపాలన రాజధానిగా ప్రకటించడంతో పాటు ఇక్కడ ఉపాధి అవకాశాలపై అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించడంతో ఐటీ హబ్‌గా విశాఖ వేగంగా ఎదుగుతోందని పల్సస్ గ్రూపు సీఈఓ శ్రీనుబాబు గేదెల తెలిపారు. ఇప్పటికే ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, అమెజాన్, అదానీ డేటాసెంటర్ వంటివి రావడంతో పాటు ఆంధ్రయూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ, పారిశ్రామిక రంగంలో నాలుగో తరం టెక్నాలజీని ప్రోత్సహించేందుకు కల్పతరువు పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలు ఇక్కడ ఏర్పాటుకావడంతో అంతులేని ఉపాధి అవకాశాల నిధిగా విశాఖ ఎదుగుతోందన్నారు. ఈ ఏడాది భారతదేశం జీ20 సమావేశాలకు వేదికగా ఎంపిక కావడంతో ఆ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని ఫార్మాస్యూటికల్, హెల్త్‌కేర్, ఐటీ, ఐటీ ఆధారిత సేవల్లో విశాఖపట్నానికి ఉన్న అవకాశాలు, అందుబాటులో ఉన్న మానవ వనరులను ప్రపంచ దేశాలకు వివరించినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఏటా మూడు లక్షలకు పైగా విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకుంటుంటే అందులో ఒక్క విశాఖ చుట్టుపక్కల నుంచే 1.5 లక్షల మంది వస్తున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో విశాఖకు ఇది కలిసొచ్చే అతిపెద్ద అంశమని ఆ నివేదికలో పేర్కొన్నారు.

వచ్చే ఐదేళ్లలో కొలువుల పండుగ..

ఇక రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు రానుండగా అందులో ఒక్క విశాఖలోనే 5 లక్షల ఉద్యోగాలు రానున్నట్లు పల్సస్ గ్రూపు అంచనా వేసింది. ఇందులో ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలోనే విశాఖలో 50,000 ఉద్యోగాలు వస్తాయని ఆ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం విశాఖలోని ఐటీ రంగం 25,000 మందికి ఉపాధి కల్పిస్తుంటే హెల్త్‌కేర్, ఫార్మా, మెరైన్ ఇండస్ట్రీస్, పర్యాటకం, రక్షణ, విద్య వంటి రంగాలు లక్ష మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ సంఖ్య ఐదేళ్లలో ఐదు లక్షలకు చేరుతుందని శ్రీనుబాబు వివరించారు.

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు



శ్రీవారి ఆలయం ఎదుట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేది



ఏపీ హైకోర్టు జస్టిస్ జైసూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, అలహాబాద్ హైకోర్టు జస్టిస్ సంగీత చంద్ర



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ దీపాంకర్ దత్తా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జై సూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంగీత చంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.

ఓపీఎస్ అమలు చేయాల్సిందే

రాంలీలా మైదాన్ సభలో ఎన్ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. సీపీఎస్ నుంచి విరమించుకోవాలనుకునే రాష్ట్రాలకు ఆ అవకాశం ఇచ్చి రాష్ట్రాల స్వేచ్ఛను కాపాడేవిధంగా సమాఖ్య స్ఫూర్తిని చాటుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగులతో భారీ బహిరంగ సభను నిర్వహించారు. జాతీయ కిసాన్ సంఘ్ నాయకుడు రాకేశ్ టికాయత్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలు హాజరైన ఈ సభలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ...ఉద్యోగుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి వాటిని కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసుకుంటున్న రాష్ట్రాలకు పెన్షన్ నిధి ఇవ్వకపోవడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడమేనని దుయ్యబట్టారు. సీపీఎస్ కారణంగా రిటైర్ అయిన ఉద్యోగులు కేవలం నెలకు రూ.1,200–1,800 పింఛను పొందుతున్నారని, తద్వారా జీవనోపాధితో పాటు సామాజిక భద్రతను కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భద్రతలో కీలకపాత్ర పోషించే పారామిలటరీ బలగాలకు కూడా పాత పింఛను విధానాన్ని నిరాకరించడం దారుణమని, వెంటనే అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభకు విజయ్‌కుమార్ (ఉత్తరప్రదేశ్), సుఖ్జీత్ సింగ్ (పంజాబ్), కల్వల శ్రీకాంత్, నరేశ్‌గౌడ్ (తెలంగాణ), వితేశ్ కండేల్కర్ (మహారాష్ట్ర), దారివాల్ (హరియాణ), ప్రదీప్ ఠాకూర్ (హిమాచల్ ప్రదేశ్), శాంతారం (కర్ణాటక)లతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, రైల్వే, అటానమస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరయ్యారు.



ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

- నారా లోకేశ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని సవాల్
- మీ బాబు అన్నం తిని కాదు.. స్టేలు తెచ్చుకుని బతుకుతోంది వాస్తవం కాదా?



సాక్షి, అమరావతి: చంద్రబాబు అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆయన తనయుడు నారా లోకేశ్ సిద్ధమా అని మాజీ మంత్రి పేర్ని నాని సవాల్ విసిరారు. చంద్రబాబు అన్నం తిని కాకుండా.. స్టేలు తెచ్చుకుని బతుకుతోంది వాస్తవం కాదా అని నిలదీశారు. అవినీతి కేసుల్లో విచారణ జరిగితే ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష పడటం ఖాయమన్నారు. విచారణకు సిద్ధంగా లేకుంటే నొక్కేసిన ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడని ప్రజలే కాదు.. టీడీపీ కార్యకర్తలు కూడా విశ్వసిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆత్మావలోకనం చేసుకోకుండా చంద్రబాబుపై అక్రమ కేసులు పెడుతున్నారని నారా లోకేశ్‌తోపాటు టీడీపీ నేతలు తెగ గగ్గోలు పెడుతున్నారని పేర్నినాని మండిపడ్డారు. బాబు అవినీతిపరుడు కాదు సచ్ఛీలుడని ఆయన కుటుంబం నమ్మితే 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

జూబ్లీహిల్స్ కొంప ఎవరు కట్టారు లోకేశ్?

హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్, మాదాపూర్ ఇళ్లు, ఎన్టీఆర్ ట్రస్టు భవనం, ఉండవల్లి కరకట్ట, మంగళగిరిలో పార్టీ కొంపలు ఎవరు కట్టారో చెప్పాలని లోకేశ్‌ను నిలదీశారు. కరకట్ట నివాసం ప్రభుత్వానిదని స్వయంగా చంద్రబాబే చెప్పారు. మరి ఓడిపోగానే ప్రభుత్వానికి ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. జనం సొమ్ము దోచుకున్నాడని బాబును అరెస్టు చేస్తే మాత్రం గంటలు మోగించాలా అని నిలదీశారు. మరోవైపు పవన్ కళ్యాణ్ లక్ష్యం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమేనన్నారు. 2019లో ఇదే పవన్.. చంద్రబాబు వెధవ, లుచ్చా అని, ప్రజల డబ్బు దోచేశాడని ప్రచారం చేశారని గుర్తు చేశారు. కాపులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లోనే పవన్ పర్యటిస్తున్నారని.. వారిని తాకట్టు పెడతావని కాపులకు తెలియదనుకుంటున్నావా అని మండిపడ్డారు. హరీశ్ రావు చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ మాట్లాడుతున్నారని.. చంద్రబాబు చేతిలో ఎన్టీఆర్‌కి అయినట్టే, హరీశ్ రావు చేతిలో కేసీఆర్‌కు కూడా అదే జరగొచ్చన్నారు.

పప్పుధాన్యాల ఉత్పత్తి తగ్గింది



శనగ పప్పు పంపిణీ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- పప్పుల ఉత్పత్తి పెంపునకు కృషి చేయాలి
- ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది
- రాయితీపై శనగ పప్పు పంపిణీ మంచి నిర్ణయం
- వినియోగదారులకు మేలు చేసేలా హాకా నిర్ణయం
- 'భారత్ దాల్' ఆవిష్కరణలో మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశంలో పప్పుల వినియోగం పెరిగిందని..అదే సమయంలో ఉత్పత్తి భారీగా తగ్గిపోయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. దీంతో దేశ అవసరాలకు ఇతర దేశాల నుంచి పప్పులు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ నేపథ్యంలో దేశంలో పప్పుల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హాకా 'భారత్ దాల్' పేరుతో పంపిణీ చేస్తున్న రాయితీ శనగపప్పు కార్యక్రమాన్ని ఆదివారం హెచ్ఐసీసీలో కేంద్ర వినియోగదారులశాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ విదేశాల నుంచి కందిపప్పును పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నామన్నారు. కంది పండిస్తే మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత్‌దాల్ పేరుతో హాకా చేస్తున్న కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. మధ్యతరగతి, పేద వినియోగదారులకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.90 ఉన్న శనగపప్పును రూ.60కే అందించడంపై అభినందనీయమని తెలిపారు. కేంద్ర వినియోగదారులశాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ రాయితీ శనగ పప్పు పంపిణీకి సంబంధించి తొలుత తమ జాబితాలో హాకా లేదన్నారు. అయితే హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాస్‌రావు తన వద్దకు పలుమార్లు వచ్చి హాకా గొప్పతనాన్ని, తెలంగాణ ప్రభుత్వ మద్దతు వివరించారని తెలిపారు. ఒక అవకాశం ఇచ్చి చూద్దామని హాకాకు శనగల పంపిణీ బాధ్యత అప్పగించామన్నారు. హాకా పనితీరు, ఏర్పాట్లు చూశాకా మరింత నమ్మకం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, హాకా ఎండీ సురేందర్, జీఎం రాజ మోహన్, ఆగ్రోస్ ఎండి కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

బోధనేతర సిబ్బంది పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం



భద్రాచలం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని తెలంగాణ గిరిజన గురుకుల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఆసక్తి కలిగిన స్థానిక ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. విద్యార్హతలు, ప్రతిభ ఆధారంగా సెలక్షన్ కమిటీ ద్వారా నియామకాలు ఉంటాయని తెలిపారు.

బొగ్గుగనుల్లో పీఎల్ఆర్ బోనస్‌పై 9న చర్చలు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గని కార్మికులకు సంబంధించిన ప్రాఫిట్ లింక్డ్ రివార్డ్(పీఎల్ఆర్) దీపావళి బోనస్‌పై జాతీయ కార్మిక సంఘాలతో ఈ నెల 9న చర్చలు జరగనున్నాయి. కోలిండియా ఆధ్వర్యాన ఈ చర్చలు జరగనున్నాయని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. గతేడాది ప్రతీ కార్మికుడికి రూ.76,500 బోనస్ అందజేయగా, ఈసారి రూ.లక్ష చెల్లించాలని తమ సంఘం డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

3, 4వ తేదీల్లో జూనియర్ అసిస్టెంట్ సర్టిఫికెట్లు పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో 177 జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2 (ఎక్స్‌టర్నల్) పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ 4న రాత పరీక్ష నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 3, 4వ తేదీల్లో పరిశీలించనున్నట్లు సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. కాగా, పరీక్ష నిర్వహించిన వారం వ్యవధిలోనే ఫలితాలు వెల్లడించినా, కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో రద్దు చేశారు. ఆ తర్వాత యాజమాన్యం ద్విసభ్య బెంచ్‌కు వెళ్లడంతో గతంలో వెల్లడించిన ఫలితాల ప్రకారమే నియామకాలు చేపట్టొచ్చని తీర్పునిచ్చింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వ జీఓ 46 ప్రకారం 177 పోస్టుల్లో ఆరుగురు దివ్యాంగులకు అవకాశమిస్తామని జీఎం తెలిపారు. ఇక ఒక అభ్యర్థి వేసిన కేసు కోర్టులో ఉన్నందున అది మినహాయించి 176 పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. సింగరేణి నియామకాల్లో నాలుగు శాతం పోస్టులు దివ్యాంగులకు కేటాయించడంపై తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గండపనేని సతీశ్‌కుమార్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

రీజియన్‌లో 6,496 మందికి లబ్ధి

సింగరేణి లాభాల్లో కార్మికులకు 32శాతం వాటా

- ఒక్కొక్కరికి రూ.1.60 లక్షలు చెల్లించే అవకాశం
- మస్టర్ల ఆధారంగా అందజేయనున్న సంస్థ



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న లాభాల వాటాపై ఇటీవల ప్రకటన వెలువడింది. గడిచిన ఆర్థిక సంవత్సరం(2022–23)లో సాధించిన రూ.2,222 లాభాల్లో 32శాతం కార్మికులకు చెల్లించనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. గత ఏడాది 30 శాతం వాటా చెల్లించగా ఈసారి మరో రెండు శాతం పెంచారు. ఈమేరకు సింగరేణి వ్యాప్తంగా 40వేల మంది కార్మికులు ఉండగా, ఇందులో కొత్తగూడెం రీజియన్‌లోని 6,496 మందికి లాభాల్లో వాటా అందనుంది. రీజియన్‌లోని కొత్తగూడెం ఏరియాలో 2,402, కార్పొరేట్ ఏరియాలో 1,030, ఇల్లెందు ఏరియాలో 591మంది, మణుగూరు ఏరియాలో 2,400 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో అండర్ గ్రౌండ్, సర్ఫేస్ కార్మికులకు మస్టర్ రూ.275.30చొప్పున, డిపార్ట్‌మెంట్లలో విధులు నిర్వర్తించే వారికి మస్టర్‌కు రూ.254.12 చొప్పున లెక్కించి చెల్లిస్తారు. ఇలా ఒక్కొక్కరికి సగటున రూ.1.60 లక్షల వరకు అందే అవకాశముంది. దసరా పండుగ లోపే వాటా చెల్లించాలని యాజమాన్యం యోచనలో ఉండగా కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా, 1999 నుంచి లాభాల్లో వాటా చెల్లిస్తుండగా, ఈసారే అత్యధికంగా అందనుందని సమాచారం.

32శాతం వాటాను స్వాగతిస్తున్నాం..



యాజమాన్యం లాభాల్లో కార్మికులకు 32శాతం వాటా చెల్లించాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే, 35 శాతం వాటా కావాలని బీఎంఎస్ ఆధ్వర్యాన పోరాడడంతోనే 32శాతంగా ప్రకటించారు. ఇదేకాక ట్రాన్స్‌కో, జెన్కో బకాయిలు కూడా రాబట్టి లాభాల్లో లెక్క చూపాలి.

– మాధవనాయక్,
ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి

పోరాట ఫలితమే...



ఏఐటీయూసీ చేసిన పోరాట ఫలితంగానే 1999 నుంచి వాటా చెల్లింపు అమలవుతోంది. యాజమాన్యం ఆరు మాసాల క్రితం ప్రకటించాల్సిన వాటాను ఇప్పుడు ప్రకటించింది. ఇకనైనా ఆలస్యం చేయకుండా త్వరగా చెల్లిస్తే కార్మికులు దసరా పండుగను సంతోషంగా జరుపుకుంటారు.

– వాసిరెడ్డి సీతారామయ్య,
ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

సీఎండీ చొరవతోనే...



సింగరేణి కార్మికులు ప్రకృతికి విరుద్ధంగా పనిచేస్తూ సంస్థకు లాభాలు తెచ్చిపెడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న సింగరేణి సీఎండీ శ్రీధర్ కార్మికులకు మెరుగైన లాభాల వాటా చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. కార్మికులు మరింత కష్టపడి వార్షిక లక్ష్యాలను సాధించాలి.

– ఆంతోటి నాగేశ్వరరావు,
ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

'స్వచ్ఛతా హీ సేవ' జీవితంలో భాగం కావాలి

భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే

అశ్వాపురం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జీవన విధానంగా మార్చుకోవాలని మణుగూరు భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే అన్నారు. మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ, కచర ముక్తి భారత్ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో దుకాణాల సముదాయం చుట్టుపక్కల శ్రమదానం చేసి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర సామగ్రిని డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా థాలే మాట్లాడుతూ పరిశుభ్రమైన, స్వచ్ఛమైన భారతదేశమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డీజీఎంలు పీజీవీ.సుధాకర్, జగ్గారావు, సీఏఓ వేణు, ఏడీఎంఓ చిత్రా జాదవ్, రాఖీప్రకాష్‌కుమార్, సైంటిఫిక్ ఆఫీసర్ చైతన్య, లక్ష్మణ్‌కుమార్, సెక్యూరిటీ ఆఫీసర్ రమణబాబు, స్నేహ వర్మ, లతకునార్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో జీఎం థాలే తదితరులు

సింగరేణిలో ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ జాడేది?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఇంటర్నల్ 277 ఉద్యోగాలు, ఎక్స్‌టర్నల్ 265 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తామని అధికారులు 2022 జనవరిలో వెల్లడించారు. ఈమేరకు చెప్పినట్లుగానే ఇంటర్నల్ నోటిఫికేషన్లు జారీ చేసి దాదాపు అన్నిపోస్టులకు రాతపరీక్ష నిర్వహించారు. కానీ ఎక్స్‌టర్నల్ పోస్టుల నోటిఫికేషన్ మాత్రం నేటికీ ఇవ్వలేదు. దీంతో కొందరు నిరుద్యోగులు వయోపరిమితి దాటుతోందని ఆందోళన చెందుతున్నారు. 2017లో 300 ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాక మళ్లీ ఇప్పటి వరకు ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. ఇకనైనా అధికారులు స్పందించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

శ్రీదేవి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



శ్రీదేవి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ భద్రాచలం పర్యటన సందర్భంగా బందోబస్తు విధులు నిర్వహించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మరణించిన శ్రీదేవి భౌతికకాయాన్ని ఆదివారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. శ్రీదేవి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, రూ.కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. శ్రీదేవి మృతితో భద్రాచలం పుణ్యక్షేత్రంలో డ్రెయినేజీ వ్యవస్థ డొల్లతనం బహిర్గతమైందన్నారు. భద్రాచలం ఏజెన్సీని, రాములోరి సన్నిధిని సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. భద్రాచలంపై వరాల జల్లు కురిపించడం మినహా ఒక్క పైసా విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో భద్రాచలం, పరిసర ప్రజలతో పాటు రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు తిప్పలు తప్పడం లేదన్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు భద్రాచలం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కూనంనేని వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ఉన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.36, 225



జలాశయంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 572 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.20,465 ఆదాయం లభించగా, 260 మంది బోట్ షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.15,760 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

'అన్న వితరణ'కు ఏర్పాట్లు



భూమి పూజ చేస్తున్న గురుస్వామి, భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: అయ్యప్ప స్వామి దీక్షాపరుల అన్న వితరణ కోసం అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి తెలంగాణ రాష్ట్ర అన్నదాన కమిటీ చైర్మన్ గురుస్వామి తాండ్ర రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని నూతన బస్టాండ్ సమీపంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఖమ్మంలో 15 ఏళ్లుగా ఈ అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ భూమి పూజ కార్యక్రమంలో ప్రచార సమితి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రతినిధులు పగడాల కిషోర్, నెల్లూరు కోటేశ్వరరావు, ముత్తయ్య, హరి, గుత్తా చంద్రశేఖర్, కొప్పురావూరి భాస్కర్ రావు, సత్యనారాయణ, మహేష్, అరుణ్, అన్నారపు నాగరామాచారితో పాటు శ్రీ సాయి గణేష్ నగర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫిలాటలీ క్విజ్ పోటీలకు 56 మంది హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ 2023 – 24 సంవత్సరానికి గాను దీన్‌దయాళ్ పథకం కింద ఆదివారం ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఫిలాటలీ(స్టాంపుల సేకరణ) స్కాలర్ షిప్ పోటీ పరీక్షను నిర్వహించింది. క్విజ్ రూపంలో ఏర్పాటుచేసిన ఈ పరీక్షకు 66 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 56 మంది హాజరయ్యారు. పరీక్షను పోస్టల్ సూపరింటెండెంట్ హర్షశర్మ, ఉద్యోగులు శ్రీరాంప్రసాద్, శిరీష, రమేష్, పమ్మి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఖమ్మం నగరంతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.